క్లుప్తంగా

భక్తులకు అన్నసంతర్పణ



పొన్నూరు: మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో శ్రీ విజయ గణపతి, అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ 15వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చుండూరు వీరయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రోశయ్య ప్రారంభించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని ఇన్నర్ రింగ్‌రోడ్డులో ఉన్న శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్నర్ రింగ్‌రోడ్డులోని భాష్యం రామసేతు క్యాంపస్ వెనుకగల ఆసుపత్రిలో జరిగే ఉచిత వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యులతో నాడి పరీక్ష, కీళ్లనొప్పులు, నడుమునొప్పి, సోరియాసిస్, గ్యాస్, మలబద్ధకం, దీర్ఘకాలిక సమస్యలు ఉచితంగా పరీక్షిస్తామన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ లేళ్ళ అప్పిరెడ్డి, భాష్యం రామకృష్ణ, ప్రముఖ వ్యాపారవేత్త ఈదా సాంబిరెడ్డి తదితరులు ప్రారంభిస్తారన్నారు.

విలేకరి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



పొన్నూరు: పట్టణానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా విలేకరి జంగం శ్రీధర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. పట్టణంలోని గాజులపాలెంలోని శ్రీధర్ నివాసంలో శనివారం అతని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పరామర్శించారు. రూ.10వేలు ఆర్థిక సహాయం అందించి, పిల్లల విద్యాభివృద్ధికి అండగా ఉంటానని చెప్పారు.

నేడు సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఆదివారం స్వరాల సంగమం పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు మధువని సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు వి.మధుబాబు ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో గాయకులు సినిమా పాటలు ఆలపిస్తారని సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

అప్స రాష్ట్ర కో–చైర్మన్‌గా మేకల రవీంద్రబాబు ఎన్నిక

నగరంపాలెం: గుంటూరు ఆర్టీసీకాలనీలోని సెయింట్ లారెల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం ఏపీపీఎస్ఏ (అప్స) రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సెయింట్ లారెల్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల అధినేత మేకల రవీంద్రబాబును రాష్ట్ర కో–చైర్మన్‌గా ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, కోశాధికారి చెరుకూరి శ్రీహరి, రాష్ట్ర నాయకులు సుందరం, వంగా శ్రీనివాసరావు, రమేష్, గుంటూరు జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు బత్తిని వెంకట్రావు, పేరిరెడ్డి, కోశాధికారి రాజేష్ నాయుడు, వీఆర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

10న ప్రతిభా పురస్కారాల ప్రదానం

పాత గుంటూరు: రాజా గారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదికగా ఈ నెల 10వ తేదీన కళాదర్బార్ సాంస్కృతిక సంస్థ, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అమరగాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, మహాదాత ఆళ్ళ దశరథరామిరెడ్డి ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు తెలిపారు. శనివారం అరండల్‌పేటలోని కార్యాలయంలో సమావేశంలో పురస్కారాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. రంగారావు మాట్లాడుతూ పదో తేదీన సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమయ్యే సభలో ప్రముఖ సినీ నటి సుధకు మహానటి సావిత్రి పురస్కారం, గాయకులు చంద్రతేజ, కె.ప్రవీణ్ కుమార్, కాట్రగడ్డ శ్రీనివాసుడు, సత్యానంద్, జయశ్రీ ప్రఖ్య, శైలజ, మాధవి, ఇందునైనలు ప్రతిభ పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ముందుగా ఘంటసాల గానామృతం పేరుతో సినీ సంగీత విభావరి జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. సంగీత అభిమానులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సంస్థ సభ్యులు వై.హేమమాలిని, బి.పావని, బాలస్వామి, బాబూరావు, రాజశేఖర్, చంద్రబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల పక్షపాతి

- పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య
- వేజండ్లలో 21 మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందజేత



వేజండ్లలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల పక్షపాతి అని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిధిలోని వేజండ్ల గ్రామానికి చెందిన 21మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూ సేకరణ చేసి లక్షలాది రూపాయల విలువ చేసే భూమిని పేదలకు ఇళ్ల పట్టాలుగా అందజేశారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత వేజండ్ల గ్రామంలో కోట్లాది రూపాయల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. కోటి రూపాయిల వ్యయంతో వేజండ్ల గ్రామంలో త్వరలో పీహెచ్‌సీ భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. కొంతమంది స్వార్థపరులు స్వలాభం కోసం పేదలకు అందించే అభివృద్ధి పనులను తమకు అనుకూలంగా మలుచుకొని చెడ్డపేరు తీసుకువచ్చే విధంగా వ్యవహరిస్తున్నారని వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్య, వ్యవసాయం, వైద్య రంగాలలో పెనుమార్పులు తీసుకువచ్చినట్లు తెలిపారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా పరిపాలనను ప్రజల వద్దకు తీసుకువచ్చినట్లు వివరించారు. తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ గతంలో పేదలుగా గుర్తించి ఇళ్ల పట్టాలు పంపిణీ సమయంలో సాంకేతిక కారణాలతో కొంత మంది లబ్ధిదారులు స్థలాలు పొందలేకపోయారన్నారు. పునః పరిశీలించి ఉన్నతాధికారుల సూచనలతో అర్హులైన 21మందికి ఇళ్ల పట్టాలు అందజేయటానికి కృషి చేసినట్లు తెలిపారు. వీరందరికి త్వరంలో గృహ నిర్మాణం పనులు చేపట్టే విధంగా సహకరించనున్నట్లు చెప్పారు.

ఇళ్ల స్థలం పట్టా అందుకోవటం ఆనందంగా ఉంది



అధికారులు, స్థానిక నాయకుల సహకారంతో ఇళ్ల స్థలం పట్టా అందుకోవటం ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేదలు సంతోషంగా ఉన్నారు. త్వరలో ఇంటి నిర్మాణ పనులు మొదలు పెడతాం.

– షేక్ నజీనా బేగం, వేజండ్ల, చేబ్రోలు మండలం

పేదలకు జగనన్న కొండంత అండ



పదేళ్ల క్రితం భర్త చనిపోవటంతో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నా. అద్దె ఇంట్లో ఉంటున్న నాకు ఇంటి స్థలం మంజూరు చేయటం సంతోషంగా ఉంది. ఇంటి స్థలంతో పాటు, గృహ నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు భరోసా ఇవ్వటం ఆనందంగా ఉంది.

– కొల్లి నాగమల్లేశ్వరి, వేజండ్ల

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



లక్షలాది రూపాయిల విలువ చేసే భూమిని అందించిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. ఇంటి స్థలం మంజూరు చేసి పట్టా అందుకోవటం ఆనందంగా ఉంది. తల్లిదండ్రులు ఇవ్వలేని భూమిని జగనన్న అందించటంతో ఆయనకు రుణపడి ఉంటాం.

– దాసరి కల్పన, వేజండ్ల సౌజన్య, వేజండ్ల, చేబ్రోలు మండలం

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



వేజండ్లలో 21మందికి ఇళ్ల పట్టాలు అందించటంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, రెవెన్యూ అధికారుల కృషి అభినందనీయం. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కోట్లాది రూపాయిల అభివృద్ధి పనులు జరిగాయి.

– కాను అనిత, వైస్ ఎంపీపీ, వేజండ్ల

బీఎల్వోలు బాధ్యతగా పనిచేయాలి

గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ రాజకుమారి

పొన్నూరు: క్షేత్రస్థాయిలో బీఎల్వోలు సక్రమంగా పనిచేస్తే ఓటర్ల జాబితా పక్కాగా ఉంటుందని, మార్పులు, చేర్పులపై జాగ్రత్తగా వ్యవహరించాలని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. నిడుబ్రోలులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. బూత్ లెవెల్ అధికారుల పనితీరు, ఓటర్ల ముసాయిదా జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల క్లెయిమ్స్ డిసెంబర్ 9 లోపల పూర్తి చేయాలన్నారు. ఒకే డోర్ నంబరులో గల 10 మంది కన్నా ఎక్కువ ఓటర్లు, జీరో డోర్ నంబర్లు, చనిపోయిన ఓటర్లు వంటి సమస్యలపై విచారణ జరిపి సత్వర చర్యలు తీసుకోవాలని అన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

జెడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని జాయింట్ కలెక్టర్ రాజకుమారి పరిశీలించారు. పిల్లలకు సమయానుసారం ఆహారం, కోడిగుడ్లను అందించాలని, నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు.

- 9 వ తరగతి పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి పురోగతిని పరిశీలించారు. పాఠశాలకు అవసరమైన లైట్లు, ఫ్యాన్లు వెంటనే ఏర్పాటుకు నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.
- పట్టణంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనం స్థానంలో నూతన భవన నిర్మాణం విషయమై సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, తహసిల్దార్ కె.శ్రీకాంత్, ఆర్ఐ రామకృష్ణ, పాల్గొన్నారు.

శభాష్ వలంటీర్



పెదకాకాని: అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్న రోగుల పట్ల మానవతా దృక్పథంతో వారు ఎక్కడ ఉన్నదీ తెలుసుకుని ఆసుపత్రులకు వెళ్లి మరీ పింఛన్‌లు అందజేస్తున్న వలంటీర్‌లు శభాష్ అనిపించుకుంటున్నారు. పెదకాకాని 5వ సచివాలయం పరిధిలో నివాసం ఉంటున్న పింఛన్‌దారుడు సయ్యద్ మహబూబ్ సుబాజి గుండె సమస్య, ఆయాసం, దగ్గు సమస్యతో గుంటూరు ఐడీ ఆసుపత్రిలోని ఐసీయూ విభాగంలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ షేక్ అమీర్‌బాషా సదరు పింఛను లబ్ధిదారు సుబాజి గుంటూరు ఆసుపత్రిలో ఉన్నట్లు తెలుసుకున్నాడు. శనివారం గుంటూరు ఐడీ ఆసుపత్రికి వెళ్లి ఆయనకు 2,750 రూపాయలు పింఛను సొమ్ము అందజేశాడు. ఈ సందర్భంగా వలంటీర్ అమీర్‌బాషాను గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి, పంచాయతీ కార్యదర్శి ఎం.రాజారామ్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

పెదకాకానిలో ప్రారంభమైన వరి కోతలు



ఉప్పలపాడులో విరగపండిన వరిపంట



నంబూరులో ఆరబెట్టిన ధాన్యాన్ని గోతాలకు పడుతున్న కూలీలు

వాయుగుండం ప్రభావంతో వాతావరణంలో మార్పులు

పెదకాకాని: వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో అన్నదాతలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. పెదకాకాని మండలంలోని నంబూరు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం గ్రామాల్లో వరికోతలు గత నాలుగు రోజుల నుంచి ప్రారంభమయ్యాయి. వర్షానికి తడవకుండా పంటను కాపాడుకునేందుకు రైతులు కృషి చేస్తున్నారు. వరికోత మిషన్ ద్వారా కోత కోయించి తద్వారా వచ్చిన ధాన్యాన్ని ట్రాక్టర్ ట్రక్కులో పోయించి పచ్చి ఒడ్లనే ఇంటికి చేర్చి ఇంటి వద్ద ఆరబెట్టుకుంటున్నారు. గతంలో మిషన్ ద్వారా కోతలు కోసిన ధాన్యాన్ని పొలంలోనూ, పొలం గట్లపైనా, కాలువ కట్టలపైనా ఆరబెట్టి ఆరిన ధాన్యాన్ని ఇంటికి చేర్చడం, అక్కడే వ్యాపారికి అమ్ముకోవడం జరుగుతూ ఉండేది. ఈ ఏడాది ఆకాశం మబ్బులు కమ్ముతుండటంతో కోత కోయించిన ధాన్యం ఇంటికి చేరితే చాలు అన్న పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా మారిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా, ఆదివారానికి తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలియజేసింది. ఈ నేపథ్యంలో వరి పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా బయటకు తీయాలని, నేలవాలిన వరిపంటను మిషన్ ద్వారా కోత కోయించి ధాన్యాన్ని ఇంటికి చేర్చుకోవాలని సూచించింది. మెట్ట రైతులు పత్తి చేనులో పత్తి తీసుకోవాలని, మిరపపంటలో పచ్చిమిరపకాయలు, పండు మిరపకాయలు కోత కోసుకుని అమ్ముకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కులు పంపిణీ



నగరంపాలెం: ఇటీవల జిల్లా ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ (హెచ్‌సీ) మాధవస్వామి, ఫిరంగిపురం పీఎస్ కానిస్టేబుల్ ఎస్.రాజేష్‌లు వేర్వేరుగా అనారోగ్య కారణాలతో మృతిచెందారు. ఈ క్రమంలో కార్పస్ ఫండ్ కింద ఒక్కొక్కరికి మంజూరైన రూ.లక్ష చెక్కులను మాధవస్వామి కుమారుడు సదానందంకు, రాజేష్ భార్య జ్యోతికి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ అందజేశారు. మినిస్ట్రీయల్ స్టాఫ్ బి–సెక్షన్ సూపరింటెండెంట్ రమాదేవి పాల్గొన్నారు.

ప్రొఫెసర్ రామారావుకు అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డు

చలపతి ఫార్మసీ కళాశాలకు బెస్ట్ అకడమిక్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అవార్డు



అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డును అందుకుంటున్న ప్రొఫెసర్ డాక్టర్ రామారావు

గుంటూరురూరల్: చలపతి ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావుకు అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డు, కళాశాలకు బెస్ట్ అకడమిక్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ 2023 అవార్డు లభించింది. చెన్నైలోని యాంటీ వైరస్ రీసెర్చ్ సొసైటీ శనివారం నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌కు, కళాశాలకు బెస్ట్ అవార్డులు రావటం సంతోషకరమని చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు తెలిపారు. రామారావు ఫార్మసీ విద్య పరిశోధన రంగాల్లో 32 సంవత్సరాల్లో 200కు పైగా పరిశోధన పత్రాలను ప్రచురించారని, 7 పుస్తకాలు, 3 పేటెంట్‌లను పొందారన్నారు. గతంలో ఆయన కరోనా మెమోరియల్ అవార్డు, హార్ట్‌ఫుల్ ప్రొఫెసర్ అవార్డు, సన్ ఫ్యూర్ రీసెర్చ్ అవార్డు, ఏపీటీఐ ప్రత్యేక ప్రశంసా పురస్కారం, ఆంధ్రప్రదేశ్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను పొందారన్నారు. ఈ సందర్భంగా కళాశాలకు పేరు ప్రఖ్యాతులు తెచ్చిన ప్రిన్సిపాల్‌ను, కళాశాల అధ్యాపకులను కళాశాల యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

పర్యావరణ కాలుష్య నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత



కాలుష్య నియంత్రణ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గుంటూరు రూరల్: పర్యావరణాన్ని కాలుష్యం కోరల నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మొక్కలు పెంచటం, పర్యావరణాన్ని కాలుష్యం నుంచి కాపాడేందుకు చేపట్టాల్సిన చర్యలు వివరించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కాలుష్య నియంత్రణ ర్యాలీ, కార్యక్రమాలను ఏవిధంగా చేపట్టాలో వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జె.సుబ్బారావు, పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ మరుద్వతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలి

ఎమ్మెల్యే కిలారి రోశయ్య

పొన్నూరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 17 సచివాలయాల పరిధిలో వార్డులలో చేపడుతున్న అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. వార్డులలో సైడ్ కాల్వలు, సీసీ రోడ్ల అభివృద్ధికి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరైనా ఇప్పటివరకు పలు సచివాలయాలలో నిర్మాణ పనులు మొదలు పెట్టకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పూర్తయిన పనులకు కాంట్రాక్టర్లకు వెంటనే బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహమ్మద్, డీఈ ఏడుకొండలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఆర్వీఆర్‌లో ఓటు హక్కుపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీకర్

గుంటూరురూరల్: ప్రజా స్వామ్యంలో ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అని గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్ అన్నారు. చౌడవరం గ్రామంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఓటు విలువను, దాని ఆవశ్యకతను ఎన్నికల ప్రక్రియ విధానాన్ని వివరించారు. ఓటర్లు సరైన ఆలోచనలతో ఓటును వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా కొత్తగా ఓటు హక్కును సంపాదించుకున్న యువత ఎన్నిక ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ప్రలోభాలకు గురికాకుండా ఆలోచనాత్మక నిర్ణయాలతో ఓటు హక్కును వినియోగించుకుని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములవ్వాలని కోరారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరిలో చైతన్యం కలిగించి సంపూర్ణ ఓటు హక్కు వినియోగించుకునేలా బాధ్యత వహించాలన్నారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునే విధంగా యువత కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ తహసీల్దార్ కె.సాంబశివరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఏఎస్‌వో ఎస్.సుబ్బయ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంతో దిగుబడి అంచనా



పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ రామకోటేశ్వరి

రేటూరు(కాకుమాను): పంటకోత ప్రయోగం ద్వారా ఎకరాకు ఎన్ని బస్తాల ధాన్యం దిగుబడి వస్తుందో అంచనా వేయవచ్చునని పొన్నూరు ఏడీఏ వి.రామకోటేశ్వరి అన్నారు. మండలంలోని రేటూరులో శనివారం వరికోత పంట ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ 5x5 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పంటను కోసి దాని ద్వారా వచ్చిన ధాన్యం ఆధారంగా ఎకరాకు ఎన్ని బస్తాల దిగుబడి వస్తుందో అంచనా వేయవచ్చునని చెప్పారు. ప్రస్తుతం ఎకరాకు 40–42 బస్తాల వరకు దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

రైతులను అప్రమత్తం చేయాలి

తుఫాన్ హెచ్చరికల దృష్ట్యా మండలంలోని వివిధ రకాల పంటలను సాగు చేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండే విధంగా వారికి అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ప్రస్తుతం గ్రామాలలో వరి పంట వివిధ దశల్లో ఉందన్నారు. ఈ ఏడాది మండలంలో 20,190 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారని అందులో ఇప్పటివరకు 5,740 ఎకరాల్లో వరి కోతలు పూర్తయినట్లు ఆమె తెలిపారు. వివిధ దశల్లో ఉన్న వరి పంటను ఎలా కాపాడుకోవాలో రైతులకు వివరించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏఓ కె.కిరణ్మయి, సిబ్బంది ఉన్నారు.

ఆర్వీఆర్‌లో ముగిసిన ఉద్వికాష్ హాక్ థాన్ పోటీలు



విజేతలతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: పరిశ్రమల్లో నెలకొనే సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించే నైపుణ్యాన్ని విద్యార్థి దశలోనే పెంపొందించుకునేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. గత రెండు రోజులుగా చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఉద్వికాష్ 24 గంటల హాక్‌థాన్ పోటీలు శనివారంతో ముగిశాయి. పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలోని వివిధ కళాశాలల నుంచి పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు తమ ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ పోటీల్లో వైజాగ్ గీతం యూనివర్సిటీ విద్యార్థుల జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రూ.35,000 నగదు బహుమతిని సర్టిఫికెట్‌లను దక్కించుకున్నారు.

హైదరాబాద్ సీబీఐటీ విద్యార్థుల జట్టు రెండవ స్థానంలో నిలిచి రూ.25,000 నగదు బహుమతిని సర్టిఫికెట్లను, ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల జట్టు మూడవ స్థానంలో నిలిచి రూ.15,000 నగదు బహుమతిని, సర్టిఫికెట్లను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పోటీల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ అనుభూతులను ఆనందంతో పంచుకున్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ నాగమల్లేశ్వరరావు, డాక్టర్ ఎమ్‌వీపీ చంద్రశేఖర్ తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు.

చలపతిలో వెబ్ సర్వీసెస్‌పై ముగిసిన శిక్షణ తరగతులు



విజేతలతో కళాశాల యాజమాన్యం

గుంటూరురూరల్: ప్రస్తుతం ప్రపంచంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ వినియోగం ప్రాముఖ్యత పెరిగిందని ఇన్నోవేటివ్ టెక్నాలజీస్ సంస్థ ప్రతినిధులు షేక్ ఖాశిం, మేనేజింగ్ డైరెక్టర్ వి.రాజేష్ తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న అమెజాన్ వెబ్ సర్వీసెస్ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు వెబ్ సర్వీసెస్‌పై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతికత దృష్ట్యా నూతన సాంకేతిక నైపుణ్యాలను విద్యార్థులు ఎప్పటికప్పుడు అవగతం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎ.బాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నవ్యాంధ్ర దాసు సంక్షేమ సంఘం వన సమారాధన

నెహ్రూనగర్: నవ్యాంధ్ర దాసు సంక్షేమ సంఘం కార్తిక వన సమారాధన(షష్టమ) ఆదివారం పేరేచర్ల నగరవనం పార్కు పక్కన, గుప్తా మామిడి తోటలో నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ మేరకు శనివారం అడపాబజార్‌లోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘం యొక్క ఐకమత్యం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నవ్యాంధ్ర దాసు సంఘీయులతో కలిసి కార్తిక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని ప్రముఖులు, గాయకులు హాజరవుతారన్నారు. చెవుల కోటి రామాంజనేయులు, వీధి పాండురంగ నాయకస్వామి, వెలిసెల అనిల్ కుమార్, డాక్టర్ పాణెం గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.